క్లుప్తంగా

మట్టి తరలింపుపై ఫిర్యాదు

మానకొండూర్: జాతీయ రహదారి నిర్మాణం కోసం మండలంలోని గట్టుదుద్దెనపల్లి, తిమ్మాపూర్ మండలం పొలంపల్లి శివారులోని గుట్టల నుంచి ఏడాదిగా అక్రమంగా మట్టి తరలిస్తున్నారని సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. రెవెన్యూ, మైనింగ్ అధికారులు పట్టించుకోవడం లేదని అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్‌కి ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బావండ్లపల్లి యుగేందర్ విన్నవించా. మట్టి తరలించకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇళ్ల నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

రామడుగు: మండలంలోని వెలిచాల గ్రామ పరిధి ఇందిరమ్మకాలనీలో అనుమతి లేకుండా ఇళ్లు నిర్మిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన న్యాయవాది బండపల్లి శ్రీధర్ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. గ్రామ శివారులో 2007–08 సంవత్సరంలో ఇందిరమ్మ గ్రామీణ శాశ్వత గృహ నిర్మాణం పథకం క్రింద మూడేళ్లలో ఇళ్లు నిర్మించుకోవాలనే నిబంధనలతో ఇతర ప్రాంతాల వారికి స్థలం కేటాయించారు. కొందరికీ ఇళ్లు మంజూరైనప్పటికీ నిర్మాణాలు చేయలేని ఫిర్యాదులో పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా స్థలాన్ని ఇతరులకు అమ్ముకొని ఇప్పుడు నిర్మాణాలు చేస్తున్నారని, పంచాయతీ నుంచి ఇంటి నంబరు పొందే ప్రయత్నాలు చేస్తున్నారని అలా జరగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

వాటర్‌ట్యాంకు మరమ్మతు చేయాలి

చొప్పదండి: పట్టణంలోని 13వ వార్డు పరిధిలోని రక్షిత మంచినీటి వాటర్ ట్యాంకు మరమ్మతులు చేపట్టాలని కాలనీ వాసులు సోమవారం అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్‌కు వినతిపత్రం అందించారు. నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన ట్యాంకుకు పగుళ్లు ఏర్పడ్డాయని, ట్యాంకు పక్కన పెట్టిన టేకు చెట్లు ట్యాంకు కంటే ఎత్తుగా పెరిగి కొమ్మలు ఇళ్లపైకి వస్తున్నామని, కోతులు, కాకుల బెడద ఎక్కువైందని వివరించారు.

2కే రన్ విజయవంతం చేయాలి

చొప్పదండి: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మంగళవారం చొప్పదండిలో చేపట్టే 2కే రన్ విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, కమిషనర్ నాగరాజు కోరారు. మున్సిపల్ కార్యాలయం నుంచి గాంధీ విగ్రహం వరకు పరుగు ఉంటుందని, పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలన్నారు. చెత్త కుప్పల ప్రదేశాల్లో చెత్తను తొలగించి ముగ్గులు వేసే కార్యక్రమం చేపడుతున్నామని, పారిశుధ్య కార్మికులకు వైద్య శిబిరం నిర్వహిస్తామని, ఉత్తమ పారిశుధ్య కార్మికులను సన్మానించనున్నామని, స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ చెక్కులు పంపిణీ చేస్తామని తెలిపారు.

నిత్యావసర సరుకులు అందజేత

గంగాధర: మండలంలోని ఆచంపల్లి గ్రామంలో సోమవారం గామ ఫౌండేషన్ చారిటబుల్ ట్రస్టు ద్వారా నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ట్రస్టు నియోజకవర్గ కార్యదర్శి పొత్తూరి సురేశ్ మాట్లాడారు. తెల్లరేషన్ కార్డు, ట్రస్టులో సభ్యత్వం పొందిన వారికి ఆహార భద్రతలో భాగంగా నిత్యావసర సరుకులు అందజేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో ఎంసీవోలు గజ్జెల సతీష్, దీకొండ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న సునీల్, తదితరులు

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని మారుతినగర్‌కాలనీలో నిరుపేదలు, వృద్ధులు, వితంతువులకు పట్టణంలోని సెయింట్ జోసెఫ్ హైస్కూల్ కరస్పాండెంట్ సునీల్ ఆధ్వర్యంలో సోమవారం రూ.పదివేల విలువ దుప్పట్లు పంపిణీ చేశారు. నంది అవార్డు గ్రహీత అంబాల ప్రభాకర్ హాజరై మాట్లాడారు. పేద విద్యార్థులకు ఫీజు రాయితీతో విద్యనందిస్తూ, సామాజిక సేవ కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు.

పశువైద్య శిబిరాలు

తిమ్మాపూర్: మండంలోని పొరండ్ల, మొగిలిపాలెంలో సోమవారం పీవీ నర్సింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ కోరుట్ల పశువైద్యశాల, పశుసంవర్ధకశాఖ జాతీయ సేవా పథకంలో భాగంగా పశువైద్య శిబిరాలు నిర్వహించారు. పశువుల్లో ప్రబలే వివిధ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు.

స్టార్టర్ డబ్బా ధ్వంసం

శంకరపట్నం: మండలంలోని కరీంపేట గ్రామానికి చెందిన గోపి రాజమల్లు స్టార్టర్ డబ్బాను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. యాసంగి నారుమడికి సోమవారం వేకువజామున నీరు పెట్టేందుకు రాజమల్లు వ్యవసాయబావి వద్దకు వెళ్లగా స్టార్టర్ డబ్బా ధ్వంసమై ఉండటంతోపాటు కరెంట్ స్తంభం నుంచి వచ్చే వైర్‌ను కట్ చేశారు. రాజమల్లు విద్యుత్‌షాక్‌కు గురి కావాలనే ఇలా చేశారని గ్రామస్తులు ఆరోపించారు. రాజమల్లు ఫిర్యాదుతో బ్లూకోల్ట్స్ పోలీసులు వివరాలు సేకరించారు.

దివ్యాంగులకు దిక్సూచి

- జమ్మికుంట సాయి మానసిక, దివ్యాంగుల ప్రత్యేక పాఠశాల
- దాతల సాయం.. విద్యా భోధన, వసతి సౌకర్యాలతో నిర్వహణ
- దాతలు చేయూత ఇవ్వాలని వేడుకోలు
- నేడు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి



దివ్యాంగుల ప్రత్యేక పాఠశాల

జమ్మికుంట: ఏం కావాలో.. ఏం చేయాలో తెలియని మానసిక పరిస్థితి, ఎదుటివారు ఏమనుకున్నా అమాయక చిరునవ్వులు చిందిస్తారు. కన్నవారు కర్మ సిద్ధాంతం అని వదిలేసినా, మానవత్వానికి లోటు లేదని నిరూపిస్తూ దాతల సాయంతో పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో జమ్మికుంటలోని సాయి మానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాల దిక్సూచిగా మారింది. పట్టణానికి చెందిన సూత్రపు బుచ్చిరాములు నలుగురు పిల్లల్లో ఇద్దరు మానసిక దివ్యాంగులు. తండ్రిగా ఆవేదన చెందుతూ తనపని తను చేసుకునేలా శిక్షణ ఇవ్వాలనే తలంపుతో దివ్యాంగుల పాఠశాలను ఇంటి నుంచి ప్రారంభించారు. అదే తడువుగా 1996లో సాయి మానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలను ఏర్పాటు చేశారు. అప్పటి ఉన్నతాధికారులు, సత్యసాయి భక్తులు, కలెక్టర్ చొరవతో ప్రభుత్వం 2.20 గుంటల స్థలాన్ని కేటాయించింది. ప్రస్తుతం 40 మందితో పాఠశాల కొనసాగుతోంది. ఎందరో దాతలు సాయం అందిస్తున్నారు. ప్రస్తుత కలెక్టర్ దివ్యాంగుల పాఠశాలను సందర్శించి తమవంతు సాయం అందిస్తామని తెలిపారు. రానున్న రోజుల్లో దివ్యాంగులకు వసతి గృహం ఏర్పాటు చేసే ఆలోచనలు చేస్తున్నారు.

విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ

- స్వతహాగా పనులు చేసుకునే విధంగా ప్రత్యేక ఉపాధ్యాయులతో శిక్షణ, భోధన.
- ప్రైమరీగా శిక్షణలో తనపని తను చేసుకోవడం, రంగులు, పేరు రాయడం.
- ప్రీ ప్రైమరీ శిక్షణగా కుటుంబ సభ్యులను గుర్తించడం, ఇంటి అడ్రస్, మండలం, జిల్లా పేర్లు గుర్తుండేలా విద్యాభోధన.
- మానసిక పరిస్థితికి అనుగుణంగా వృత్తి విద్యా శిక్షణ పరిజ్ఞానం నేర్పించడం.
- ప్రతిరోజు ఆటలు, పౌష్టికాహారం అందించి మానసిక ఉల్లాసం కలిగించడం.

కావాల్సిన వసతులకు చేయూత..

దివ్యాంగులకు భోజనశాల, తాగునీటి వంటి మౌలిక వసతుల కల్పన, ఇంటి నుంచి వచ్చే దివ్యాంగులకు మినీ బస్సు సౌకర్యం కల్పించడం, ఆశ్రమంలో పనిచేసే ఉపాధ్యాయులు, సిబ్బందికి వేతనాలు అందించేందుకు దాతలు స్పందించి ఉదారత చాటుకోవాలని కోరుతున్నారు. జమ్మికుంట, వీణవంక, ఇల్లందకుంటతోపాటు ఇతర జిల్లాల నుంచి దివ్యాంగులు వస్తున్నారు. ఇప్పటి వరకు 40 మందికి ప్రత్యేక ఉపాధ్యాయులు, సిబ్బందితో విద్యాబోధన, సేవలు, వృత్తి విద్యా శిక్షణ, ఆటల వంటి కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.



పాఠాలు బోధిస్తున్న ప్రత్యేక టీచర్

పిల్లల సేవే లక్ష్యం



నలుగురు పిల్లల్లో ఇద్దరు మానసిక దివ్యాంగులు. మా నసిక స్థితి సరిగా లేనివారి పరిస్థితి ఎంతో ఆవేదనకు గురి చేసింది. నాతోపాటు ఇతర పిల్లల తల్లిదండ్రులు పడే బాధను అర్థం చేసుకొని మానసిక దివ్యాంగులు వారి పనులు సొంతంగా చేసుకునే విధంగా శిక్షణ ఇస్తున్నాం. కుటుంబ సభ్యులను గుర్తించడం, మానసిక స్థితిని మెరుగైనస్థాయికి తీసుకువచ్చి వృత్తి విద్య బోధించి జీవనం సాగించేలా చేయడమే లక్ష్యంగా పాఠశాల కొనసాగిస్తున్నాం. దాతలు చేయూత అందిస్తే మరిన్ని ప్రత్యేకతలతో మానసిక దివ్యాంగులకు సేవ చేస్తాం.

– సూత్రపు బుచ్చిరాములు, వ్యవస్థాపక, పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు, జమ్మికుంట

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ

జమ్మికుంట: వావిలాల పీహెచ్‌సీ డాక్టర్లు రాజేశ్‌కుమార్, మొలుగు చందన ఆధ్వర్యంలో అర్బన్ ఆరోగ్య కేంద్రం పరిధిలో సోమవారం ఎయిడ్స్ దినోత్సవం పురస్కరించుకొని వైద్యసిబ్బంది ర్యాలీ నిర్వహించారు. వ్యాధిపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని, ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు అందరు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్‌రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్స్ అరుణ, సదానందం, రత్నకుమారి, హెల్త్ అసిస్టెంట్ నరేందర్, అర్బన్ ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్లు, వైద్య సిబ్బంది



మెరిట్ విద్యార్థులకు ఉపకార వేతనాలు

చిగురుమామిడి: మండలంలోని ఇందుర్తి జెడ్పీ పాఠశాల తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు ఉల్లాస్ ట్రస్టు నుంచి ఉపకార వేతనాలు అందించారు. సోమవారం ట్రస్టు ప్రతినిధి కేతిరెడ్డి ప్రతాప్‌రెడ్డి సంస్థ నుంచి మెరిట్ విద్యార్థులు పది మందికి రూ.వెయ్యి చొప్పున చెక్కులు పంపిణీ చేశారు. ప్రతి సంవత్సరం ట్రస్టు నుంచి మెరిట్ విద్యార్థులకు ఉపకార వేతనాలు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జయప్రద, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ బందెల మల్లవ్వ, ఉస్మాన్‌పాషా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

జమ్మికుంట: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈవో హేమలత అన్నారు. పట్టణంలోని బాలుర పాఠశాలలో మండల పరిధిలోని పాఠశాలలకు చెందిన మధ్యాహ్నభోజన నిర్వాహకులు, హెచ్‌ఎంలతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. మధ్యాహ్న భోజన పథకంలో ఎలాంటి అవకతవకలకు పాల్పడవద్దన్నారు. పోషక విలువలతో కూడిన ఆహారం అందించాలని సూచించారు. భోజన పథకం బిల్లు నెలనెలా అందించే విధంగాశ్రద్ధ తీసుకుంటామని, ఎలాంటి సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, భోజన నిర్వాహకులు పాల్గొన్నారు.

కేజీబీవీ సందర్శనకు అనుమతివ్వని ప్రత్యేక అధికారి

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం కేజీబీవీ సందర్శనకు సోమవారం బీఆర్‌ఎస్‌వీ నాయకులకు స్పెషల్ ఆఫీషర్ మాధవి అనుమతి ఇవ్వలేదు. గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లు, కేజీబీవీ, మోడల్ స్కూల్‌లో వసతులు తెలుసుకునేందుకు గురుకులాల బాట పేరిట హరిబాబు ఆధ్వర్యంలో నాయకులు కేజీబీవీ వద్దకురాగా డీఈవో అనుమతి ఉండాలని మాధవి స్పష్టం చేయగా వెనుదిరిగారు. కాగా కేజీబీవీలో ఉడికి ఉడకని అన్నం, నీళ్లచారు వడ్డిస్తున్నారని విద్యార్థినుల తల్లిదండ్రులు ఆరోపించారు. పేరెంట్స్ మీటింగ్‌కు హాజరైన తల్లిదండ్రులు వంటలు పరిశీలించి అన్నం పూర్తిగా ఉడకడం లేదని విలేకరులకు వెల్లడించారు. కొంతమంది టీచర్లు విద్యార్థినులను బెదిరిస్తున్నారని, ఎంఈవో కేజీబీవీని తనిఖీ చేయాలని డిమాండ్ చేశారు.

నిరుపేదలకు వయోజన విద్య



పుస్తకాలు అందిస్తున్న సేవా భారత్ ప్రతినిధి ప్రవీణ్

రామడుగు: నిరుపేద కుటుంబాలకు సేవా భారత్ ఆధ్వర్యంలో వయోజన విద్య కార్యక్రమం చేపడుతున్నామని సేవా భారత్ ప్రతినిధి ప్రవీణ్ తెలిపారు. మండల కేంద్రంలో వ్యాలీ ఆఫ్ బెరాకా మినిస్ట్రీస్, సేవా భారతి ఆధ్వర్యంలో రామడుగు, మల్యాల, కొడిమ్యాల, బోయినపల్లి మండలాల్లోని దాదాపు 20 గ్రామాల్లో వయోజన విద్య కేంద్రాలను ప్రతినిధులు సోమవారం ప్రారంభించారు. కేంద్రాలకు అవసరమైన సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో అబ్రహాం, ప్రవీణ్, సంజీవ్, నర్సయ్య, దేవయ్య, దేవదాసు పాల్గొన్నారు.

పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయాలి

మానకొండూర్: కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయాలని సీపీఐ నాయకులు అన్నారు. గన్నేరువరం మండల కేంద్రంలో సోమవారం మాట్లాడారు. రుణమాఫీ కాని రైతులు చాలామంది ఉన్నారని, దీనిపై అధికారులు విచారణ జరిపాలని, ప్రభుత్వం అందరికీ రుణమాఫీ చేయాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి కాంతాల అంజిరెడ్డి, సహాయ కార్యదర్శి చొక్కాల శ్రీశైలం, మండల నాయకులు కూన మల్లయ్య, బోయిని మల్లయ్య నయీమ్, కొరివి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



పెద్దపట్నం వద్ద వొడితెల ప్రణవ్


జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని శ్రీదుబ్బమల్లికార్జునస్వామిని సోమవారం ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మల్లికార్జునస్వామి కల్యాణమహోత్సం సందర్భంగా పెద్దపట్నం వేశారు. కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ స్వామివారిని దర్శించుకున్నారు.

అయ్యప్ప మహా పడిపూజ



మానకొండూర్: మండలంలోని పచ్చునూరు గ్రామంలో ముత్తునూరి కొమురయ్య ఆధ్వర్యంలో సోమవారం అయ్యప్ప మహా పడిపూజ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అయ్యప్పస్వాములు, భక్తులు భజన, భక్తి గీతాలు ఆలపించారు. మహా పడిపూజకు పెద్ద ఎత్తున అయ్యప్పస్వాములు, కన్నె స్వాములు హాజరయ్యారు. గురుస్వామి కుసుమ ప్రదీప్, అయ్యప్ప స్వాములు గోపు కేశవరెడ్డి, పిన్నింటి కేశవరెడ్డి, కంది రాజిరెడ్డి, కసిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కన్నె స్వామి ,దాసారం బాబు భక్తులు పాల్గొన్నారు.

సన్మానం



శంకరపట్నం: శబరిమలకు పాదయాత్ర చేసి తిరిగి పెద్దపల్లి జిల్లా మంథని వెళ్తున్న అయ్యప్ప దీక్షస్వాములను సోమవారం వంకాయగూడెం అయ్యప్ప స్వామి ఆలయంలో గురుస్వామి చింతం సత్యనారాయణ, పూజారి సుమన్‌శాస్త్రి సన్మానించారు. ఐదుగురు అయ్యప్పదీక్షాస్వాములు కాలినడకన శబరిమలకు వెళ్లారు.

వీధి కుక్కల పట్టివేత

ఎనిమల్ కేర్ సెంటర్‌కు తరలింపు



జమ్మికుంట: పట్టణంలో వీధి కుక్కలు బెడద ఎక్కువ కావడంతో మున్సిపల్ కమిషనర్ ఎండీ అయాజ్ ఆదేశాల మేరకు సోమవారం వీధి కుక్కల పట్టివేత కార్యక్రమం నిర్వహించారు. పలువార్డుల్లో కుక్కలను పట్టుకొని హుజూరాబాద్ ఎనిమల్‌కేర్ సెంటర్‌కు తరలించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ వన్యప్రాణుల సంరక్షణ చట్టం ప్రకారం ఎనిమల్ కేర్ సెంటర్‌కు తరలించి కు.ని ఆపరేషన్ నిర్వహించే విధంగా చర్యలు చేపట్టామన్నారు. కేర్ సెంటర్‌లో ఆపరేషన్ అనంతరం కుక్కల సంరక్షణకు నిధులు కేటాయించామని తెలిపారు.

మెరుగైన ఫలితాలు సాధించాలి

హుజూరాబాద్: రాబోయే పది పరీక్షల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు సత్యనారాయణరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలకల ఉన్నత పాఠశాలను ప్రభుత్వ పాఠశాలల పర్యవేక్షణలో భాగంగా ఆకస్మికంగా సందర్శించారు. ప్రణాళికతో విద్యార్థులను చదివించాలని, ఉదయం,సాయంత్రం తరగతులకు పిల్లలందరూ హాజరయ్యేలా చూడాలని సూచించారు. మార్క్స్ రిజిస్టర్లు, విషయాల వారీగా నిర్వహించిన వారంత పరీక్షల ఆన్సర్ పేపర్లను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ ప్రతి రోజూ విధిగా పాఠశాలకు రావాలని, ఎప్పటికప్పుడు వచ్చిన సందేహాలను నివృత్తి చేసుకొని ఉత్తమ జీపీఏసాధించాలని సూచించారు. హెచ్‌ఎం శోభారాణి, సీసీ శ్రీనివాస్, టీచర్లు పాల్గొన్నారు.

వైద్య శిబిరం విజయవంతం

హుజూరాబాద్: మండలంలోని కాట్రపల్లి గ్రామంలో జయన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరం విజయవంతమైనట్లు జయన్న ఫౌండేషన్ చైర్మన్ గుడిపాటి జైపాల్ రెడ్డి తెలిపారు. జీపీ ఆవరణలో సోమవారం హైదరాబాద్‌కు చెందిన శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు 480 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి కావాల్సిన మందులు అందజేశారు. 80 మందికి శస్త్ర చికిత్స అవసరమని వారిని జయన్న ఫౌండేషన్ అధినేత జైపాల్ రెడ్డి,సింగాపూర్ మాజీ జెడ్పీటీసీ గుడిపాటి సరిత బస్సులో హైదరాబాద్‌కు ఆపరేషన్ కోసం తరలించారు. మండలంలో ఇప్పటి వరకు మూడు నేత్ర వైద్య శిబిరాలను నిర్వహించామన్నారు. వృద్ధులు కంటి చూపుతో బాధపడకూడదని భావించి కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. మాజీ సర్పంచ్ కాసగాని నిరోషా,నాయకులు కిరణ్, ఇంద్రసేనారెడ్డి, శంకర కంటి ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మాక్ పోలింగ్

హుజూరాబాద్: పట్టణంలోని విజ్ఞాన్ నెక్స్‌జెన్ స్కూల్‌లో సోమవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. స్కూల్ కరస్పాండెంట్ దాసరి కోటేశ్వర్‌యాదవ్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఎన్నికలు ముఖ్యమని,18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరు ఓటు వేయడానికి అర్హులని, ఓటు ద్వారా మంచి నాయకుడిని ఎన్నుకోవాలన్నారు. స్కూల్ డైరెక్టర్ తిరుపతి యాదవ్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్,ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

సౌకర్యాలు మెరుగుపరచాలి

హుజూరాబాద్: ప్రభుత్వ హాస్టళ్లలోని విద్యార్థులకు సౌకర్యాలు మెరుగుపరచాలని బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం నాయకుడు అనురాగ్ అన్నారు. బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం పిలుపు మేరకు హాస్టల్ బాట నేపథ్యంలో సోమవారం పట్టణ శివారులోని గురుకుల పాఠశాలలో మౌలిక సౌకర్యాలను పరిశీలించారు. పిల్లలకు అందిస్తున్న భోజనం విధానం, పరిసర ప్రాంతాలు, వంటగది పరిశీలించి నాణ్యమైన ఆహారం అందించాలని అధికారులను కోరారు.

టీచర్లకు కలెక్టర్ అభినందన

మానకొండూర్: మండలంలోని జంగంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి టెడ్ ఎడ్‌కు ఎంపికైనందుకు కలెక్టర్ పమేలా సత్పతి సోమవారం ఉపాధ్యాయులను అభినందించారు. కలెక్టర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు వసుంధర, శ్రీనివాస్, శారద, ప్రత్యేకాధికారి అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ పమేలా సత్పతితో ఉపాధ్యాయులు

ట్రస్టు సేవలు అభినందనీయం

ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర: మండలంలోని కొండాయిపల్లి గ్రామంలో రేండ్లశ్రీనివాస్‌పద్మ ఆధ్వర్యంలోని మాడిశెట్టి మహాలక్ష్మి ట్రస్టు సేవలను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అభినందించారు. సోమవారం గ్రామంలో ఆడపిల్ల పుట్టిన కుటుంబాలకు ఫిక్స్‌డు డిపాజిట్ బాండ్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఏడేళ్లుగా ఆడపిల్ల పుట్టిన వెంటనే రూ.ఐదు వేల చొప్పున ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయడం మంచి కార్యక్రమం అనిపేర్కొన్నారు. గ్రామానికి చెందిన తుమ్మల మహేందర్ అనారోగ్యంతో మృతి చెందగా మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే రూ.పదివేలు అందించారు. కార్యక్రమంలో నాయకులు పురమల్ల మనోహర్, వేముల భాస్కర్, జాగిరపు శ్రీనివాస్‌రెడ్డి, సత్తు కనుకయ్య, దుబ్బాసి బుచ్చయ్య, బూర్గు గంగన్న, రేండ్ల రాజిరెడ్డి, అట్ల రాజిరెడ్డి, దోర్నాల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఫిక్స్‌డ్ బాండ్లు అందజేస్తున్న ఎమ్మెల్యే సత్యం

బీజేపీ నాయకుల బైక్ ర్యాలీ

మానకొండూర్: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నాయకులు మండలంలోని గట్టుదుద్దెనపల్లి, చెంజర్ల, మానకొండూర్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. హామీలు నెరవేర్చకుండా సంబరాలు చేసుకోవడం ఏంటని ప్రశ్నించారు. ఆరు గ్యారంటీలు అమలు చేయకపోతే రానున్న రోజుల్లో మరిన్ని ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.

హుజూరాబాద్: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తికావస్తున్నా హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని బీజేపీ హుజూరాబాద్ పట్టణ అధ్యక్షుడు రాజు ఆరోపించారు. కమలాపూర్ నుంచి హుజూరాబాద్ వరకు బైక్ ర్యాలీ, అంబేద్కర్ చౌరస్తాలో సభ నిర్వహించారు.

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి గుట్ట నుంచి అల్గునూర్ వరకు నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు.



మానకొండూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

పోర్జరీతో పట్టా చేసుకున్నారని ఆందోళన



ఆందోళన చేస్తున్న బాధితురాలు

శంకరపట్నం: తండ్రి సంతకాన్ని పోర్జరీ చేసి అక్రమంగా చేసుకున్న పట్టాను రద్దు చేయాలని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం బాధితురాలు కొరిమి విజయ ఆందోళన చేశారు. ఐదేళ్ల క్రితం అప్పటి తహసీల్దార్ ,ఆర్ఐ, వీఆర్వో కలిసి తన తండ్రి కొరిమి బాలయ్య పేరిట ఉన్న తొమ్మిది గుంటల భూమిని కొరిమి అయోధ్య, సారంగపాణికి పట్టా చేశారని ఆరోపించారు. సీపీఎం మండల కార్యదర్శి రాజిరెడ్డి, ఎమ్మార్పీఎస్ నాయకులు ఆడెపు నర్సయ్య, సమ్మయ్య, మాల మహానాడు నాయకుడు భూర్ల మొగిళి మద్దతు పలికారు. అనంతరం పట్టా రద్దు చేయాలిని డిప్యూటీ తహసీల్దార్ మల్లేశంకు ఫిర్యాదు చేశారు.

శ్రీపతిరెడ్డి మృతి తీరనిలోటు

చిగురుమామిడి: మండలంలోని నవాబుపేటకు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు కూతురు శ్రీపతిరెడ్డి అకాల మృతి పార్టీకి తీరనిలోటని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య, చిగురుమామిడి సింగిల్‌విండో చైర్మన్ జంగ వెంకటరమణారెడ్డి అన్నారు. సోమవారం పార్టీ నాయకులతో కలిసి శ్రీపతిరెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మండల మాజీ అధ్యక్షుడు కృష్ణమాచారి, మండల మాజీ కో ఆప్షన్ సభ్యుడు మక్బుల్‌పాషా, నాయకులు మనోజ్‌కుమార్, పిల్లి వేణు, కూతురు వరబందరెడ్డి, దోనపాటి కృష్ణారెడ్డి, రాజిరెడ్డి, తిరుపతిరెడ్డి, కార్యకర్తలు, గ్రామస్తులు ఉన్నారు.

విద్యోదయ విద్యా సంస్థల అధినేత ..

జమ్మికుంట: పట్టణంలోని విద్యోదయ విద్యా సంస్థల అధినేత ,కరస్పాండెంట్ జమ్మికుంట మాజీ ఎంపీపీ ఏబూషి రామస్వామి (65) సోమవారం మృతి చెందాడు. ఉమ్మడి అంధ్రప్రదేశ్‌లో దివంగత మంత్రి ముద్దసాని దామోదర్‌రెడ్డి ముఖ్య అనుచరుడిగా, టీడీపీ నుంచి జమ్మికుంట ఎంపీపీగా పనిచేశారు. 1993–94లో విద్యోదయ విద్యా సంస్థలు స్థాపించాడు. అస్వస్థతకు గురై చికిత్స పొందుతూ హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో మృతి చెందాడు. పట్టణానికి చెందిన ప్రజాప్రతినిధులు, విద్యాసంస్థల అధినేతలు, పాఠశాల పూర్వ విద్యార్థులు, కులసంఘం నాయకులు, పుర ప్రముఖులు కుటుంబానికి సంతాపం తెలిపారు.

అన్నదమ్ముల గొడవ

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం మెయిన్ రోడ్డుపై సోమవారం అన్నదమ్ములు గొడవపడినట్లు గ్రామస్తులు తెలిపారు. గొడవలో ఒకరి బైక్ ధ్వంసమైంది. సమాచారం అందుకున్న కేశవపట్నం పోలీసులు వివరాలు సేకరించారు. ఒకరిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

శంకరపట్నం: మండలంలోని తాడికల్ గ్రామ శివారులో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ముత్తారం గ్రామానికి చెందిన రేకుల కుమార్, నూనె రమేశ్ కరీంనగర్ నుంచి బైక్‌పై స్వగ్రామం వస్తుండగా డివైడర్‌ను ఢీకొని రోడ్డుపై పడిపోయారు. స్థానికులు కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు.